క్లుప్తంగా

సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన నేతలు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన మేకా శేషుబాబు, జంగారెడ్డిగూడెం నాయకులు

జంగారెడ్డిగూడెం: చింతలపూడి నియోజకవర్గంతో పాటు ఏలూరు పార్లమెంట్ స్థానాల్లో ఫ్యాన్ గాలి బలంగా వీయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లు గౌడ్ సంఘం, జంగారెడ్డిగూడెం వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా మంగళవారం ఉంగుటూరు నియోజకవర్గం నారాయణపురంలో బస చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మేకా శేషుబాబు, మేకా శశికళ, జంగారెడ్డిగూడెం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌యాదవ్ సమక్షంలో సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన వారిలో పీపీఎస్ చంద్రరావు, సుదగాని రవిశంకర్ నారాయణ్ (ఐఆర్‌ఎస్), తల్లాడి నేతాజీ శ్రీనివాస్, చింత అనిల్‌కుమార్, తల్లాడి సంజయ్ తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

జంగారెడ్డిగూడెం రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీవో కె.విజయ్ ప్రసాద్ ప్రారంభించారు. కార్యాలయానికి వివిధ పనులపై వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మైక్‌సెట్ బహూకరణ

జంగారెడ్డిగూడెం రూరల్: తాడువాయిలోని కోదండరామస్వామి ఆలయానికి జంగారెడ్డిగూడెంకు చెందిన వంకదారి రామకృష్ణ, ప్రశాంతి మంగళవారం మైక్‌సెట్‌ను బహూకరించారు. విశ్వహిందూ పరిషత్ పరిషత్ సభ్యుల చేతుల మీదుగా ఈ మైక్‌సెట్‌ను ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో కోదండ రామాలయ కమిటీ సభ్యులు, వీహెచ్‌పీ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

కొయ్యలగూడెం: మంగపతిదేవిపేట గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు మంగళవారం ఆందోళన నిర్వహించారు. మంచినీటి బోరు పాడైపోవడం వల్ల వారం రోజుల నుంచి ఇబ్బంది ఏర్పడిందని తెలిపారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరారు. సీపీఐ నేత జె.శ్రీనివాసరావు, స్థానికులు నరసయ్య, గుడే శ్రీను, జక్కు కొవ్వాడియ్య పాల్గొన్నారు.

ఫారం పాండ్‌లతో భూగర్భ జలాల పెంపు



గురవాయిగూడెంలో నిర్మించిన ఫారం పాండ్‌ల వద్ద రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: ఫారం పాండ్‌ల ఏర్పాటుతో భూగర్భ జలాలు పెరుగుతాయని తద్వారా పంటల దిగుబడులు పెరిగి మంచి ఆదాయం రైతులకు సమకూరుతుందని జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారి రాము అన్నారు. గురవాయిగూడెంలో దల్లి అప్పలరెడ్డి పొలం, టిక్కినవారిగూడెంలో పోతన వెంకట శ్రీనివాస్ పొలంలో పైలెట్ ప్రాజెక్టుగా ఫారం పాండ్‌లను నిర్మించారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారి రాము, ఎంపీడీవో కె.విజయ్ ప్రసాద్ ఈ రెండు గ్రామాల్లో ఫారం పాండ్‌లను పరిశీలించి వీటి కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. జంగారెడ్డిగూడెం మండలంలో 79 ఫారం పాండ్‌లు మంజూరైనట్లు ఎంపీడీవో విజయ్ ప్రసాద్ తెలిపారు. అన్ని గ్రామాల్లో ఫారం పాండ్‌లను నిర్మించుకోవాలని సూచించారు. జంగారెడ్డిగూడెం క్లస్టర్ ఏపీడీ ఆనందరావు పాల్గొన్నారు.

సుబ్బారావుకు సత్కారం



సుబ్బారావును అభినందిస్తున్న పీఎంపీలు

కొయ్యలగూడెం: ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్ (పీఎంపీలు) తమ సేవలతో ప్రజలకు ఎంతో చేరువయ్యారని, కరోనా వారియర్స్ గ్రూపులో పీఎంపీలు కూడా నిలవడం గర్వకారణంగా ఉందని పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.ప్రభాకర్, కార్యదర్శి వీబీటీ రాజు పేర్కొన్నారు. ముఖ్యంగా ఏజెన్సీ మెట్ట ప్రాంతంలో అప్‌లాండ్ పీఎంపీ అసోసియేషన్ సభ్యులు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పీఎంపీలకు స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. వీరిని ముందుండి నడిపించడంలో, సొంత భవనాన్ని నిర్మించడంలో పీఎంపీల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సుబ్బారావు కృషి ఎంతగానో ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం నిర్వహించిన పీఎంపీల సమావేశంలో సుబ్బారావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏఆర్‌కే పరమేశ్వర్, ఎస్‌కే సుభాని, రాజమండ్రి జిల్లా అధ్యక్షుడు బళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రీరామనవమికి ఆలయాలు ముస్తాబు

- సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి

చింతలపూడి: చినభద్రాద్రిగా పిలువబడే యర్రగుంటపల్లి గ్రామ సమీపంలోని శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయం శ్రీరామనవమి ఉత్సవాలకు ముస్తాబైంది. ఇక్కడ బుధవారం సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి ఏటా శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు ఇక్కడికి వస్తుంటారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. రాముడి గట్టుగా ప్రసిద్ధికెక్కిన శ్రీసీతారామాంజనేయ ఆలయాన్ని ఈ ప్రాంత భక్తులు చిన్న భద్రాచలంగా పిలుచుకుంటారు. భద్రాద్రిలో వెలసిన విగ్రహాలను పోలి ఇక్కడి విగ్రహాలు ఉండటం విశేషం. ఆశ్చర్యమేమిటంటే భద్రాచలంలో సీతాదేవి రాముల వారి తొడపై ఆసీనురాలైనట్లు ఇక్కడ కూడా అదే విధంగా అమ్మవారు కూర్చుని ఉండటం జరిగింది. వందల ఏళ్ళ క్రితం శ్రీరామచంద్రుడు సీతాలక్ష్మణ సహేతుడై శంఖు చక్రాలతో ఈ ప్రాంతంలో వెలిసినట్లు పూర్వీకులు చెప్తుంటారు.

కోర్కెలు నెరవేర్చే స్వామి

ఇక్కడ స్వామివారి కల్యాణం జరిపితే పెళ్లికాని అమ్మాయిలకు పెళ్లవుతుందని, సంతానం లేనివారికి సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం. ఈ ఆలయానికి చేరువలో కైలాసపతి పరమేశ్వరుడు నందీ సమేతంగా కొండ పైభాగంలో వేంచేసి ఉన్నాడు. పరమశివుణ్ని శ్రీరాముడు ముళ్ళ గోరింట పూలతోను, బొంత పూలతోను పూజించినట్లు, వెలగ, నేరేడు పండ్లను నివేదించినట్లు చరిత్ర చెబుతోంది. ప్రతీ ఏటా చైత్రశుద్ధ నవమికి ఇక్కడ స్వామివారి కల్యాణాన్ని వైభవంగా జరుపుతారు. ఆలయ కమిటీతో పాటు, ఆదిమంచి సత్యన్నారాయణ శాస్త్రి కుటుంబీకులు స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని గ్రామస్తుల సహకారంతో జరుపుతున్నారు. సీతారామాంజనేయ ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో కృషి జరుగుతోంది.



యర్రగుంటపల్లి రాముని గట్టుపై కొలువైన సీతారామ లక్ష్మణులు



బుట్టాయగూడెంలో రామాలయంలో సీతారామలక్ష్మణ ఆంజనేయుల విగ్రహాలు

తూర్పుయడవల్లిలో శ్రీరామనవమి ప్రత్యేకం

జిల్లాలోని కామవరపుకోట మండలం తూర్పుయడవల్లి గ్రామంలో కొలువైయున్న శ్రీ సీతారామస్వామి దేవస్థానం. దీనిని ద్వారకాతిరుమల దేవస్థానం వారు దత్తత తీసుకుని ఉప దేవాలయంగా స్వీకరించారు. మండల కేంద్రానికి 5 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఈ దేవాలయం ప్రతిష్ఠ 2003 జూన్ 19 వ తేదీన 'పరమహంస పరివ్రాజకా చార్య' శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించారు. శ్రీరామనవమి సందర్భంగా ఇక్కడ తెల్లవారుజామున ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తారు. ఇక్కడ కూడా భద్రాచలంలో ఉన్నట్లే శ్రీరాముని తొడ భాగమున సీతాదేవి కూర్చుని ఉండటంతో ఈ ఆలయాన్ని కూడా భక్తులు చిన భద్రాద్రి అని పిలుచుకుంటారు.



తూర్పుయడవల్లిలో భద్రాచలం సీతారాములను పోలి ఉన్న సీతారామ లక్ష్మణుల విగ్రహాలు



బయ్యనగూడెంలో విద్యుత్ దీపాలంకరణతో శోభిల్లుతున్న పెద్ద రామాలయం

గిరిజన ప్రాంతాల్లో...

బుట్టాయగూడెం: శ్రీరామనవమి వేడుకలకు గిరిజన ప్రాంతంలోని రామాలయాలు ముస్తాబయ్యాయి. సీతారాముల కల్యాణ వేడుకలను రోజుకో వేడుక చొప్పున ఘనంగా 9 రోజుల పాటు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. బుట్టాయగూడెంలో సుమారు 61 సంవత్సరాల క్రితం నిర్మించిన రామాలయంలో, స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయంలో, అలాగే ఏజెన్సీలోని ప్రతి గ్రామాల్లోని రామాలయాల్లో, దుద్దుకూరులో వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, గ్రామస్తులు అన్ని ఏర్పాట్లు చేశారు. అలాగే మండలంలోని లక్ష్మీపురంలో చెట్లను సీతారామ, లక్ష్మణులు, ఆంజనేయ స్వామిలుగా చేసి పూజలు చేస్తున్న సంప్రదాయం నేటికీ కొనసాగుతూ వస్తోంది. అక్కడ శ్రీరామ నవమి ఉత్సవాలను నిర్వహించేందుకు గ్రామస్తులు ఏర్పాట్లు చేశారు.

విద్యుత్ కాంతులతో...

కొయ్యలగూడెం: శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకొని బుధవారం శ్రీసీతారాముల కల్యాణ వేడుకలకు రామాలయాలతో పాటు వైష్ణవ క్షేత్రాలు, శైవక్షేత్రాలు దేవతామూర్తుల కోవెలలు, ముస్తాబయ్యాయి. బయ్యన్నగూడెం పెద్ద రామాలయాన్ని విద్యుత్ కాంతులతో శోభాయమానంగా తీర్చిదిద్దగా కన్నాపురంలోని దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని సీతారామచంద్రస్వామి ఆలయం, కొయ్యలగూడెం 8వవార్డుతో సహా మరో మూడు రామాలయాల్లో నవమి వేడుకలు చేయనున్నారు.

ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి



యర్రగుంటపల్లి రాముని గట్టు(ఆలయాన్ని) మరింత అభివృద్ధి చేయడానికి ట్రస్ట్ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నాం. ప్రభుత్వం కూడా ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాల్సిన అవసరం ఉంది. ఆలయానికి చెందిన భూములను ట్రస్ట్‌కు అప్పగించి ప్రభుత్వం రక్షణ కల్పించాలి. ఆలయం వద్దకు రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేసి పర్యాటక కేంద్రంగా అభివద్ధి చేయాలి.

– వి సత్యన్నారాయణ శాస్త్రి, ఆలయ కమిటీ అధ్యక్షుడు, యర్రగుంటపల్లి

పారదర్శకంగా జగనన్న సంక్షేమ పాలన



పోలవరం రూరల్: మోటార్‌సైకిల్ ర్యాలీలో ఎమ్మెల్యే బాలరాజు



పోలవరం రూరల్: మహిళలతో కలిసి పసుపు కొడుతున్న పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి



జంగారెడ్డిగూడెం: ప్రచారం నిర్వహిస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు, పార్టీ నాయకులు

- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- రాజ్యలక్ష్మితో కలిసి ఎన్నికల ప్రచారం

పోలవరం రూరల్: కుల, మతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం జగనన్నకు దక్కుతుందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. పోలవరం మండలంలోని పట్టిసీమ, బంగారంపేట, కృష్ణారావుపేట, నూతనగూడెం ప్రాంతాల్లో ఆయన పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలు అడుగడుగునా బాలరాజు దంపతులకు హారతులు ఇస్తూ స్వాగతం పలికారు. మళ్లీ సంక్షేమ పాలన రావాలంటే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. పోలవరం ఎమ్మెల్యేగా తెల్లం రాజ్యలక్ష్మిని, ఎంపీగా కారుమూరు సునీల్‌కుమార్‌ను గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలుచేశారన్నారు. చెప్పిన వాటితో పాటు చెప్పని పథకాలు కూడా అమలు చేసిన ఘనత ప్రభుత్వానిదేనన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వల్ల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. ప్రతి ఇంటికి ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బుగ్గా మురళీకృష్ణ, జెడ్పీటీసీ కలుం హేమకుమారి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ స్థాయిలో పాల్గొన్నారు. గ్రామాల్లో మోటార్‌సైకిళ్లపై ఎమ్మెల్యే బాలరాజు కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే రావాలి

జంగారెడ్డిగూడెం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. పట్టణంలోని 20వ వార్డులో వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య ఆధ్వర్యంలో గడపగడపకు ఎన్నికల ప్రచారం మంగళవారం నిర్వహించారు. ఈ ప్రచారంలో పాల్గొన్న కంభం విజయరాజు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎందుకు రావాలో ప్రజలకు వివరిస్తున్నారు. పెన్షన్ ప్రతి నెలా 1వ తేదీనే ఇంటి వద్దకే రావాలన్నా, చిన్నారులకు ఇంగ్లీష్ మీడియం చదువులు అందాలన్నా, అమ్మ ఒడి, చేయూత, ఆసరా తదితర పథకాలు కొనసాగాలనా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే రావాలన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరగాలంటే వైఎస్సార్‌సీపీనే గెలిపించాలని కోరారు. ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కారుమూరి సునీల్‌కుమార్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని విజయరాజు కోరారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, పోలవరం నియోజకవర్గ పరిశీలకులు జెట్టి గురునాధరావు, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సీనియర్ నాయకులు మేడవరపు విద్యాసాగర్, వైస్‌చైర్మన్‌లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవీరత్నం, రాష్ట్ర ఎస్సీ సెల్ సెక్రటరీ పంతగాని వెంకన్న, రాష్ట్ర మహిళా సెక్రటరీ కాసర తులసి రెడ్డి, షేక్ అక్బర్, ముప్పిడి శ్రీనివాసరావు, గెద్దాడ శ్రీనివాసరావు, మానవతా మూర్తి, పీపీఎస్ చంద్రరావు, కటారి వాసు, ఉగ్గం దుర్గాప్రసాద్, దొంతు మాధవ్, ఎల్‌వీఆర్, నేకూరి కిషోర్, వెంపఐజి, భావన ఋషి, వాస రామకృష్ణ, బత్తిన చిన్న, చిప్పాడ వెంకన్న, మహమ్మద్ హాఫీజ్, గూడపాటి రాధాకృష్ణ, చలమాల శ్రీనివాసరావు, ఓరుగంటి నాగేంద్ర, కాసర బన్నీ రెడ్డి, కర్పూరం గుప్తా, కళ్యాణ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీసీతారాముల కల్యాణం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని తాండ్ర పాపారాయుడు సెంటర్ రామాలయం ఆవరణలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి శ్రీసీతారాముల కల్యాణం నిర్వహిస్తున్నట్లు వెలమ సంక్షేమ సంఘం, తాండ్ర పాపారాయుడు యూత్ సభ్యులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆలయంలో కార్యక్రమాల వివరాలు వెల్లడించారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 9 గంటల నుంచి ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. విజయవాడ మణిపాల్ హాస్పిటల్స్ వారిచే కేన్సర్ సంబంధిత వ్యాధులకు పరీక్షలు, కామినేని హాస్పిటల్స్ వారిచే బీపీ, సుగరు, థైరాయిడ్ ఊపిరితిత్తులు, గుండె సంబంధిత వ్యాధులకు పరీక్షలు చేసి మందులు ఉచితంగా పంపిణీ చేయబడుతుందన్నారు. శంకరనేత్రాలయ, ఏలూరు వారిచే కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్ చేయడం జరుగుతుందన్నారు. ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శుక్రవారం మధ్యాహ్నం 12గంటల నుంచి భారీ అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



వేడుకల వివరాలు తెలియజేస్తున్న కమిటీ సభ్యులు

రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ

బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏలో ఏర్పాటు చేసిన పోలవరం అసెంబ్లీ రిటర్నింగ్ కార్యాలయంలో ఈ నెల 18వ తేదీ నుంచి నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఐటీడీఏ పీఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం. సూర్యతేజ తెలిపారు. ఈనెల 25వ తేదీ నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ అని చెప్పారు. 26న నామినేషన్ల పరిశీలన, 29న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని చెప్పారు. మే 13వ తేదీన పోలింగ్, జూన్ 4వ తేదీన కౌంటింగ్ నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. నామినేషన్‌ల ప్రక్రియ గురువారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ నిర్వహిస్తామన్నారు. నామినేషన్‌లకు సంబంధించి కేవలం నలుగురిని మాత్రమే అనుమతిస్తామన్నారు. అలాగే రిటర్నింగ్ కార్యాలయానికి 100 మీటర్ల దూరంలో 3 వాహనాలను మాత్రమే ఉంచే విధంగా అనుమతించడం జరుగుతుందని చెప్పారు.

ఐటీడీఏలో ఆర్‌వో కేంద్రం సిద్ధం

గతంలో పోలవరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి జంగారెడ్డిగూడెం ఆర్‌డీఓ కార్యాలయంలో నామినేషన్‌లు స్వీకరించేవారు. అయితే ఈ ఏడాది ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయాన్ని కేఆర్‌పురం ఐటీడీఏలో ఏర్పాటు చేశారు. ఐటీడీఏ పీఓ, పోలవరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం. సూర్యతేజ నామినేషన్ పత్రాలను స్వీకరించనున్నారు. ఈ మేరకు నామినేషన్ స్వీకరణ కేంద్రాలను సిద్ధం చేశారు.



కేఆర్‌పురం ఐటీడీఏలో ఏర్పాటు చేసిన పోలవరం ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయం

మంచి ముహూర్తాల కోసం వాకబు

బుట్టాయగూడెం: ఈ నెల 18వ తేదీ నుంచి నామినేషన్ల పర్వం ప్రారంభంకానుంది. ఆయా రాజకీయ పార్టీల నుంచి పోటీ చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థులు ఇప్పటికే ప్రచారం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఆయా అభ్యర్థులు నామినేషన్ ఎప్పుడు వేస్తే బాగుంటుందో పురోహితులను సంప్రదిస్తున్నారు. ముహూర్తం ఎప్పుడు బాగుంది? నామినేషన్ ఏ రోజు వేస్తే విజయ అవకాశాలు ఉంటాయి అని పండితులను అడిగి తెలుసుకుంటున్నారు. అత్యధికంగా ఏప్రిల్ 18, 22, 24 తేదీల్లో నామినేషన్‌లు వేసేందుకు మంచి ముహూర్తాలు ఉన్నట్లు పురోహితులు చెప్తున్నారని పేర్కొంటున్నారు. దీనితో ఆయా తేదీల్లోనే నామినేషన్లు వేసేందుకు ఎమ్మెల్యే అభ్యర్థులు సన్నాహాలు చేసుకుంటున్నారు.

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం

ద్వారకాతిరుమల: రాష్ట్రాభివృద్ధితోపాటు సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన పార్టీ నేతలత కలిసి రామన్నగూడెం, దేవినేనివారిగూడెం, హవేలి లింగపాలెం గ్రామాల్లో మంగళవారం గడప గడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా ఇంటింటికి వెళ్లి జగనన్న ఐదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. కరోనా కష్టకాలంలోనూ సంక్షేమ పథకాలను ఆపకుండా, పేదలను జగన్ ఆర్థికంగా ఆదుకున్నారన్నారు. అలాంటి నాయకుడికి మనమంతా అండగా నిలవాలని కోరారు. గోపాలపురం ఎమ్మెల్యేగా తానేటి వనితను, రాజమండ్రి ఎంపీగా గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి, మండల జేసీఎస్ కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ, బొండాడ వెంకన్నబాబు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, సొసైటీ చైర్‌పర్సన్ చెరుకూరి ప్రసాదరావు, కేతా కోటేశ్వరరావు, షేక్ ఇస్మయిల్, జిత్తుక శ్రీనివాసరావు, గొర్రెల పల్లాలు, యాదాల శ్రీనివాసరావు, నార్ని నాగేశ్వరరావు, ముక్క రామన్న, సురేష్, గొన్నూరి సూరయ్య, కొత్తపల్లి రమేష్, దాకారపు అగ్గియ్య, షేక్ భాషా, డీజే రాజు, బుసనబోయిన వంశీ తదితరులు పాల్గొన్నారు.



రామన్నగూడెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

పోలింగ్ సజావుగా జరిగేలా కృషి చేయాలి

టి.నరసాపురం: పోలింగ్‌ను సజావుగా నిర్వహించేలా పోలింగ్ అధికారులు కృషిచేయాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ టి.సుభాష్ అన్నారు. టి.నరసాపురం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం పోలింగ్ సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఏఆర్‌వో సుభాష్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కేటాయించిన విధులను తూచ తప్పకుండా పాటిస్తూ పోలింగ్ నిర్వహించాలన్నారు. ఉదయం 5 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్ద మాక్ పోలింగ్ నిర్వహించాలన్నారు. సమస్యలు ఉంటే గుర్తించి పోలింగ్ సమయానికి నివృత్తి చేసుకోవాలని సూచించారు ఈ సందర్భంగా పోలింగ్ సిబ్బంది వ్యవహరించాల్సిన తీరుతెన్నులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనల గురించి అసెంబ్లీ నియోజకవర్గస్థాయి మాస్టర్ ట్రైనీ జి.లక్ష్మణరావు వివరించారు. శిక్షణ కార్యక్రమంలో మండలంలోని 206 మంది పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ నిర్వహణపై శిక్షణ

కొయ్యలగూడెం: ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులందరూ సమష్టిగా కృషి చేయాలని అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనీ ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మార్వో రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఓపీఓలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులకు ఎన్నికల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. 60 పోలింగ్ కేంద్రాలలో 263 మంది విధులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

జంగారెడ్డిగూడెం: అగ్నిప్రమాదాలపై అవగాహన కలిగి ఉండటం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని అగ్నిమాపక శాఖ అధికారి జి.అబ్రహం అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం అపార్ట్‌మెంట్‌లు, శ్రీవెంకటేశ్వర స్కూల్, కళాశాలలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిప్రమాదాలు సంభవించే కారణాలు, ప్రమాదం సంభవించినప్పుడు ప్రమాద తీవ్రతను తగ్గించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఫైర్ అధికారి అబ్రహం వివరించారు.

పెండ్లి కుమారుడైన రామభద్రుడు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని బుట్టాయగూడెం రోడ్‌లో వేంచేసియున్న శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభం కాగా, భక్తులు ఆలయానికి తోరణాలు కట్టి, పసుపుకొట్టారు. ఆలయ అర్చకులు శ్రీరామచంద్రమూర్తి వేదమంత్రోచ్ఛరణ నడుమ స్వామి వారిని పెండ్లికుమారుడిని చేశారు. బుధవారం శ్రీసీతారాముల కల్యాణం వేడుకగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు చెప్పారు.

కందుకూరి జయంతి



వృద్ధాశ్రమంలో నిర్వహిస్తున్న అన్నసమారాధన

కొయ్యలగూడెం: సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు 176వ జయంతి కార్యక్రమం కల్పవృక్షం వృద్ధాశ్రమంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు సాలస సుధాకర్ సౌజన్యంతో ఆశ్రమంలోని వృద్ధులకు అన్నసమారాధన చేశారు. యుగ పురుషుడిగా, సంఘసంస్కర్తగా కందుకూరి వీరేశలింగం పంతులు చేసిన సేవలను ఆదర్శ కార్యక్రమాలను రోటరీ క్లబ్ సభ్యులు వివరించారు. ముందుగా వృద్ధులతో కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. మాదేటి అప్పలరాజు, మాదేటి సత్యనారాయణ, యాతం సత్యనారాయణ, వీరవరపు నివాస్, చిటికెన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కామవరపుకోట: స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ మండల కార్యదర్శి అధ్యక్షతన కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వీరేశలింగం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అన్నప్రసాద వితరణ

జంగారెడ్డిగూడెం: శ్రీవల్లీ దేవసేన సమేత సుందర బాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో మంగళవారం అన్నప్రసాద వితరణ చేశారు. కమిటీ అధ్యక్షుడు కానూరి గంగాధరరావు, సభ్యుల పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 1600 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కాకినాడకు చెందిన కోడిగుడ్డు సత్యవతి పేరున ఆమె కుమారుడు సత్తిబాబు దాతగా వ్యవహరించినట్లు చెప్పారు.

కూరగాయల పంపిణీ

టి.నరసాపురం: భూక్యా గోపయ్య సక్రమ ఫౌండేషన్ ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం కృష్ణాపురంలో నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు భూక్యా వేణుగోపాల్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో 50 కుటుంబాలకు మాజీ సర్పంచ్ జరబల పూర్ణయ్య చేతుల మీదుగా కూరగాయలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భూక్యా ధనలక్ష్మి. తేజవత్ చంద్రశేఖర్. జరబల సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి

చింతలపూడి: పెరిగిన ఉష్ణోగ్రతల దృష్ట్యా వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్‌కే అబ్రార్ హుస్సేన్ సూచించారు. ఫాతిమాపురంలో నిర్వహించిన అవగాహన శిబిరంలో ఆయన మాట్లాడుతూ వృద్ధులు, గర్భిణులు, పిల్లలు అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి మూడు గంటల వరకు ఆరుబయట సంచరించకుండా ఉండాలన్నారు. ఎండ వేడి తగలకుండా కాళ్లకు చెప్పులు, గొడుగు, తెల్లటి కాటన్ వస్త్రాలు ధరించాలన్నారు. ఎక్కువ నీటిని తీసుకోవాలని ఆయన సూచించారు. మత్తు పానీయాలు వంటివి దరిచేరనివ్వకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ పి.అరుణ, హెల్త్ అసిస్టెంట్ విష్ణుమూర్తి, అవ్వమ్మ, అంగన్‌వాడీ టీచర్ సరోజినీ తదితరులు పాల్గొన్నారు.